కథాకేళి



# మల్లాది వెంకటకృష్ణమూర్తి

## హైజాక్

హైదరాబాద్ నించిరాజమండ్రి బయలు దేరిన వాయుదూత్ రన్‌వే మీద పరిగెత్తి గాల్లోకి క్షేమంగా ఎగిరింది.

ఆడోరేవియర్ విమానాన్ని నడుపుతున్న కెప్టెన్‌కులకర్ణి విమానం ఎనిమిది వేల అడుగుల ఎత్తుకి ఎగిరాక కోపైలట్‌తో చెప్పాడు–

"వెదర్ క్లియర్‌గా వుంది."

అకస్మాత్తుగా కాక్‌పిట్‌లోకి ఇద్దరు యువకులు ప్రవేశించారు. ఇద్దరి చేతుల్లో రివాల్వర్ లున్నాయి.

"చేతులెత్తండి" అరిచారిద్దరు వాటిని ఎక్కుపెట్టి.

"మేం చేతులెత్తితే విమానం కూలిపోతుంది" చెప్పాడు కులకర్ణి.

"అయితే ఎత్తద్దు."

"మీరెవరు?" అడిగాడు కోపైలట్.

"హైజాకర్స్" చెప్పాడు ఇద్దరిలో ఒకరు.

"ఎక్కడికి హైజాక్ చేయాలి?"

"రాజమండ్రికి" చెప్పాడు రెండో యువకుడు.

"ఇది వెళ్ళేది రాజమండ్రికే" ఆశ్చర్యంగా చెప్పాడు కెప్టెన్ కులకర్ణి.

"మాకది తెలుసు. వెంటనే అధికారులకి చెప్పండి–ఈ విమానం ఇద్దరు హైజాకర్స్ చేతుల్లో వుందని."

"మీరు శ్రీలంక టెర్రరిస్ట్‌లా? పంజాబ్ టెర్రరిస్ట్‌లా?" అడిగాడు కోపైలట్.

"ఇప్పుడే చెప్పం."

వైర్‌లెస్‌లో కెప్టెన్ కులకర్ణి తమ విమానం హైజాక్ చేయబడిందని చెప్పాడు. నిముషాల్లో ఆ వార్త రాష్ట్ర ఐ.జి.కి, డి.ఐ.జి.కి, హోమ్ మినిస్టర్‌కి, దేశ హోం మినిస్టర్‌కి, సెక్రటరీలకి, రాజమండ్రి పోలీసులకి తెలియ చేయబడింది.

"రాజమండ్రిలో విమానం దిగాక ఎవరూ విమానం దగ్గరికి రాకూడదని హెచ్చరించు. వస్తే విమానం పేల్చేస్తాం" చెప్పాడు మొదటి యువకుడు.

"బాంబు లేవి?" అడిగాడు కులకర్ణి అనుమానంగా.

"మా లగేజ్ అదే."

"బాంబు లెలా కొన్నారు?" అడిగాడు కోపైలట్.

"కిలో అరవై ఏడు రూపాయలు. కడపకన్నా శివకాశిలో చవక" చెప్పాడు రెండో యువకుడు.

"మీ డిమాండ్స్ ఏమిటి?" అడిగారు కింద నించి. కులకర్ణి వాళ్ళని అదే అడిగాడు.

"ఎవరా అడిగేది?" అడిగారు యువకులు.

"రాజమండ్రి ఎయిర్‌పోర్ట్ స్వీపర్."

"స్వీపరా?"

"అవును. మేనేజర్ టాయ్‌లెట్‌కి వెళ్ళాడుట. అడగమని వుంటాడు."

"పాపం భయపడినట్టున్నారు. మా డిమాండ్స్ సాక్షాత్తు ముఖ్యమంత్రికీ, ప్రధాన మంత్రికీ తప్ప లోకేడర్స్ వాళ్ళకి చెప్పం అని చెప్పండి" చెప్పాడు రెండో యువకుడు.

కింద నించి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ మాట్లాడాడు అయిదు నిముషాలాగి. ముఖ్యమంత్రితోనో, ప్రధాన మంత్రితోనో మాట్లాడటం కుదరదని చెప్పాడు.

"ఎందుకు కుదరదు? విమానం పేల్చేస్తాం" ఉగ్రంగా చెప్పాడో యువకుడు.

"ముఖ్యమంత్రి విశ్వామిత్ర సినిమా షూటింగ్‌లో వున్నారు. ప్రధాన మంత్రి పారిస్‌లోని ప్రధాన మంత్రుల సమావేశ విషయమై వెళ్ళారు"–జవాబు వచ్చింది.

ఇద్దరూకాసేపు చెవులు కొరుక్కున్నారు.

"రాజీవ్ గాంధి దేశంలోనే వున్నారు. ఇవాళ వుదయం టి.వి.లో చూశాం. అబద్ధం" చెప్పాడు.

"ఒట్టు. వార్సా ప్రధాన మంత్రి ఇందాకే ఫోన్ చేసి తమ ప్రధాన మంత్రుల సమావేశం ఏర్పాటుచేయాలనుకుంటున్నానని చెప్తే రాజీవ్ గాంధి 'ఫోన్‌లో కాదు, వుండండి వస్తున్నాను. స్వయంగా మాట్లాడదాం' అని చెప్పి వెళ్ళారు."

"మీ డిమాండ్స్ ఏమిటి?" అడిగాడు జిల్లా ఎస్.పి. మళ్ళీ.

"పోనీ రాష్ట్ర హోం మినిస్టర్‌తో మాట్లాడతాం."

"ఆయన తనకి పోలీసు వాహనాల కొనుగోలులోని కుంభకోణానికి సంబంధం లేదని ప్రమాణం చేయడానికి తూర్పు గోదావరి జిల్లాలోని గుడి కెళ్ళారు."

మళ్ళీ చెవులు కొరుక్కున్నారిద్దరూ.

"రాజమండ్రి వచ్చింది. దింపమంటారా?" అడిగాడు కెప్టెన్ కులకర్ణి.

"సరే దింపు."

దిగాక చెప్పాడు ఎస్.పి. - మునిసిపల్ శాఖామాత్యులు రాజమండ్రిలో రోడ్లు వూడ్చే యంత్రాన్ని ఆవిష్కరించడానికి వచ్చివున్నారని, కావాలంటే ఆయనతో మాట్లాడవచ్చని.

"మరీ మంచిది" చెప్పాడు మొదటి యువకుడు.

ఆ శాఖామాత్యులు హుటాహుటిన సంతోషంగా ఎయిర్‌పోర్ట్‌లోని వైర్‌లెస్ దగ్గరికి వచ్చారు.

"ఏమిటి మీ డిమాండ్లు? వాళ్ళ నేం చేయక" చెప్పారాయన.

"మా డిమాండ్లు తీర్చేది నువ్వేగా. తీర్చకపోతే కపిక్కిన పైలట్ తల తెగేసి బయటికి విసిరేస్తాం" కసిగా చెప్పారిద్దరు ఏక కంఠంతో.

"ఏమిటో చెప్పండి."

"వెంటనే ముషీరాబాద్ కాన్‌స్టిట్యుయెన్సీలోని భోలక్‌పూర్ నించి గాంధినగర్‌దాకా, రామ్‌నగర్ నించి కవ్వాడిగూడ దాకా రోడ్లమీద నెలల తరబడి పేరుకు పోయిన చెత్తని తీయించు. రోడ్లు వేయించు. దోమలు పోవడానికి ఆ ప్రాంతాలలో పొగమందు వేయించు. రోడ్లన్నీ శుభ్రపడేలా వూడ్పించు. పబ్లిక్ లేవెట్రీలన్నీ వాసన రాకుండా కడిగించు. రోడ్లమీద పారే డ్రెయినేజ్ వాటర్‌ని అరికట్టించు."

"ఇంకా?"

"ఇంతవరకు సరేనా?" అనుమానంగా అడిగారు ఆ ఇద్దరు.

"ఫండ్స్ లేవు. మీరు చెప్పేవంత తేలిక కాదది."

మళ్ళీ ఇద్దరు చెవులు కొరుక్కున్నారు. తర్వాత చెప్పారు–

"పోనీ రోడ్లు వేయకపోయినా కనీసం రోడ్ల మీద గుంటలనయినా పూడ్పించే ఏర్పాటు చేయించు."

"సారీ సర్. మునిసిపల్ శాఖామాత్యులు హడావిడిగా విజయవాడ వెళ్ళారు" వినిపించిందో కంఠం.

"ఎందుకు వెళ్ళారు? ఇక్కడ అరవై ప్రాణాలు మా చేతుల్లో వున్నాయి తెలుసా?" గర్జించారు.

"అక్కడ అరవై ప్రాణాలు హైజాకర్ల చేతుల్లో వున్నాయి. వాళ్ళు ఏకంగా ఏవ్రోనే హైజాక్ చేసారు."

"దేనికట?" అడిగాడు మొదటి యువకుడు.

"మీ డిమాండ్లే. కాన్‌స్టిట్యుయెన్సీ మాత్రం మారింది. రంగారెడ్డి జిల్లా వాళ్ళట. వనస్థలిపురం... హలో... మీరు వెయిట్ చేయండి. ఇంకో విమానం వస్తోంది."

■